నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 29 ఏప్రిల్ 2025 | HYDERABAD

సిటీబ్యూరో: ద్రోణి ప్రభావంతోరెండు రోజులుగా కొంత చల్లబడిన నగర వాతావరణం పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో మళ్లీ వెడెక్కుతోంది. సోమవారం నగరంలో గరిష్ఠం 37.1, కనిష్ఠం 25.5 డిగ్రీలు, గాలిలో తేమ 31 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

లైసెన్స్ పొందండి.. మొక్క నాటండి..!

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): లైసెన్స్ పొందడం ఎంత బాధ్యతాయుతమో.. అలాగే కొత్తగా లైసెన్స్ పొందినవాళ్లు ఒక్క మొక్క నాటడం కూడా అంతే బాధ్యతాయుతమని ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రవాణా శాఖ కార్యాలయాల్లో లైసెన్స్ పొందేవాళ్లు మొక్క నాటాలని సూచిస్తున్నారు. పెరుగుతున్న కాలుష్యంతో పర్యావరణం నాశనమవుతుందని.. మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి తెలిపారు. కచ్చితంగా మొక్క నాటాలనే నిబంధన అమలు చేస్తున్నామన్నారు. మొక్క నాటి తమకు స్క్రీన్ షాట్ పెట్టాలని సూచిస్తున్నట్టు పేర్కొన్నారు.

తొలిసారిగా పేగు మార్పిడి..

ఉస్మానియాలో మరో అరుదైన శస్త్రచికిత్స

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. తొలిసారిగా ఓ వ్యక్తికి పేగు మార్పిడి చేశారు. 40 ఏండ్ల ఓ వ్యక్తి షార్ట్‌గట్ సిండ్రోమ్ అనే పేగు సమస్యతో బాధపడుతూ ఉస్మానియాలో చేరాడు. పదే పదే సెంట్రల్‌లైన్ ఇన్‌ఫెక్షన్స్‌తో పాటు రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం తదితర కారణాలతో రోగి చిన్న పేగులోని కొంత భాగాన్ని తొలగించారు. దీంతో చిన్నపేగు పరిమాణం 30 సెం.మీలకు కుదించుకుపోయింది. పేగు పరిమాణం తగ్గడంతో ఆక్సిజన్, ఇతర పోషకాలను తీసుకోలేక శరీరం బలహీనంగా మారి, ప్రాణపాయ స్థితికి చేరాడు. సమస్య రోజురోజుకు తీవ్రమయ్యే అవకాశాలుండడంతో రోగికి పేగు మార్పిడి చేయాలని నిర్ణయించిన సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్.. ఈనెల 9న జీవన్మృతుడి నుంచి సేకరించిన పేగును మార్పిడి చేశారు. సర్జరీ సక్సెస్ కావడంతో రోగి క్రమంగా కోలుకుంటున్నట్లు డాక్టర్ మధుసూదన్ తెలిపారు. పేగు మార్పిడి చేయడం తెలుగు రాష్ట్రాల్లోనే ఇది తొలిసారి అని వైద్యులు తెలిపారు.

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

లక్షలాదిగా.. స్వచ్ఛందంగా..

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని, ఆదివారం ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడమే ఇందుకు నిదర్శనమని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఊహించిన దాని కంటే గొప్పగా బీఆర్ఎస్ పార్టీ సభ జరిగిందన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

చిరస్థాయిగా నిలిచేలా

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 28: తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా వరంగల్ ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రతి ఒక్కరికీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి వేలాది సంఖ్యలో తరలివచ్చి సభను ఘన విజయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

ధన్యవాదాలు

సికింద్రాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలందరికీ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతానికి కృషి చేసిన నియోజకవర్గ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

అనుకూలమైన చోటు కోసం అడ్డదారులు

- నిబంధనలకు విరుద్ధంగా పరస్పర బదిలీలు
- రంగారెడ్డి జిల్లా 'విద్యాశాఖ'లో రాజకీయ జోక్యం
- భారీగా డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు



రంగారెడ్డి, ఏప్రిల్ 28 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డిజిల్లా విద్యాశాఖ కార్యాలయం అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. బదిలీలు, అనుకూలమైన చోటుకు వెళ్లేందుకు అధ్యాపకులు అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. జిల్లాలో అనుకూలమైన పోస్టులు లేకున్నా.. అధికారుల అండదండలతో ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు జిల్లాలోకి వచ్చి చేరుతున్నారు. వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిబంధనలు అడ్డొస్తున్నా.. విద్యాశాఖ అధికారులు యథేచ్ఛగా బదిలీలు చేస్తున్నారు. బదిలీ అయిన పాఠశాలల్లో ఆయా సబ్జెక్టుల పోస్టులు ఖాళీ లేకపోవటంతో వేతనాలు చెల్లించడంలో గందరగోళం నెలకొంది.

మితిమీరిన రాజకీయ జోక్యంతో..

రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీ విషయంలో మితిమీరిన రాజకీయ జోక్యం, డబ్బుల ప్రలోబాలు పెద్ద ఎత్తున తెరమీదకు వస్తున్నాయి. ముఖ్యంగా 317 జీవోను అడ్డం పెట్టుకుని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పెద్దఎత్తున రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వస్తున్నారు. వీరి బదిలీల్లో తెరవెనుక అధికార పార్టీకి చెందిన బ్రదర్స్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో ఆయా పోస్టులు లేకున్నా.. అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి జిల్లా విద్యాశాఖ అధికారులు వారిని చేర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ జరిపించాలి

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో బదిలీల భాగోతంపై పారదర్శకంగా విచారణ జరిపించాలి. రంగారెడ్డి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయి. ఇతర జిల్లాల నుంచి 317 జీవోను అడ్డుపెట్టుకుని జిల్లాకు రావడంతో పాటు సీనియారిటీ పేరుతో హెచ్ఆర్ఏ ప్రాంతాలకు వస్తున్నారు. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– బొడ్డు రవి, సేవ్ టీచర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

స్పాజ్ కేటాయింపులో..

ప్రభుత్వం నియమించిన 317 జీవో కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సు మేరకు రంగారెడ్డి జిల్లా స్పాజ్ కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. తలకొండపల్లి మండలంలో జడ్పీహెచ్ఎస్ పడకల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషులో పనిచేస్తున్న వారి స్పాజ్ కేటాయింపు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషును కౌన్సిలింగ్ ద్వారా అదే మండలంలో జడ్పీహెచ్ఎస్ ఖానాపూర్ పాఠశాలకు మొదటగా కేటాయించారు. కానీ వారు విధుల్లో చేరలేదు. ఆ పాఠశాలలో ఒకే ఇంగ్లిషు పోస్టున్నప్పటికీ వారికి 24 శాతం హెచ్ఆర్ఏ ప్రాంతమైన సరూర్‌నగర్ మండలంలోని జడ్పీఎచ్ఎస్ రాజీవ్ గాందీనగర్ పాఠశాలకు 20 రోజుల తర్వాత కేటాయించారు. వీరికి కూడా రీ కౌన్సిలింగ్ తర్వాత తలకొండపల్లి మండలం ఖానాపూర్ జిల్లా పరిషత్‌కు కేటాయించాలి..కానీ కేటాయించకుండా అదే స్థానం రాజీవ్‌గాంధీనగర్‌లోనే కొనసాగిస్తున్నారు. ఇది పూర్తిగా స్పాజ్ నిబంధనలకు విరుద్ధం.

తప్పుల తడకగా సీనియారిటీ లిస్టు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జడ్పీఎచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులు లేవు. అయినా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు, సోషల్ రెండు స్పాజ్ పోస్టుల్లోనూ ఇచ్చారు. వారిలో ఒక్కరిని స్పాస్ కింద కడ్తాల్ మండలంలోని జడ్పీఎచ్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి స్పాస్‌ను అదే కడ్తాల్ మండలంలో ఏదో ఒక్క పాఠశాలలో కేటాయించాలి. కానీ.. పోస్టులు లేని తొర్రూరు పాఠశాలలో 24 శాతం హెచ్ఆర్ఏను నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు టీచర్‌ను కేటాయించారు. స్పాస్‌లో భాగంగా మరో ఉపాధ్యాయురాలు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి పోస్టులు లేని తొర్రూరు పాఠశాలకు కేటాయించారు. రీ కౌన్సిలింగ్ ద్వారా జడ్పీహెచ్ఎస్ తారామతిపేటకు కేటాయించారు. శేరిగూడ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ పోస్టులు లేకున్నా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి స్పాస్ కేటాయింపులో శేరిగూడ పాఠశాలకు.. రీ కౌన్సిలింగ్ ద్వారా ఓ ఉపాధ్యాయున్ని కప్పాడుకు కేటాయించారు. పద్మశాలిపురంలో ఓ ఉపాధ్యాయుడు ఈనెలలో రిటైర్డ్ అవుతున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా జీవో 317 అమలు సమయంలో ఇతను జడ్పీహెచ్ఎస్ ఆకుతోటపల్లిలో పని చేస్తున్నాడు. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడిని సీనియారిటీ లిస్టులో నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయించారు. నిబంధనలకు విరుద్ధంగా అతన్ని వికారాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ విషయంపై సేవ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకునే నాథుడే లేడు.

కాలేయ వ్యాధి బాధితులకు కేసీఆర్ పథకం ఆపన్న హస్తం

4 లో

- కాలేయ బాధితులకు అభయమిస్తున్న కేసీఆర్ పథకాలు
- పేదలకు పైసా ఖర్చు లేకుండా.. ఉచితంగా క్లిష్టమైన సర్జరీలు
- 2018లో ఆటో లివర్ ట్రాన్స్‌ప్లాంట్...నేడు 42 మందికి లివర్ ట్రాన్స్‌ప్లాంట్స్
- 5000 మందికి జీఐ కాంప్లెక్స్.. 300 మందికి లివర్ క్యాన్సర్ సర్జరీలు

అవయవ మార్పిడికి గాంధీ సిద్ధం

ఫలితమిస్తున్న కేసీఆర్ సంకల్పం

- వైద్యశాలలో నోడల్ కేంద్రం
- 2022లోనే రూ.35 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టిన కేసీఆర్ సర్కారు
- 95 శాతం పనులు పూర్తి.. త్వరలో అందుబాటులోకి..

4 లో

బాధితులకు అండగా జాతీయ మహిళా కమిషన్

చైర్‌పర్సన్ విజయ రహత్కార్

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): గృహ హింస, లైంగిక, లైంగిక వేధింపులు, సైబర్ క్రైమ్ బాధిత మహిళలకు జాతీయ మహిళా కమిషన్ అండగా నిలుస్తుందని చైర్‌పర్సన్ విజయ రహత్కార్ అన్నారు. సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా సమగం హాల్ లో ఏర్పాటు చేసిన మహిళా జన్ సున్వాయి(బహిరంగ విచారణ)లో ఆమె పాల్గొని కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్ లో కమిషన్ మొదటగా ఏర్పాటు చేసి మహిళా బాధితుల నుంచి 60 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. మహిళలు పడుతున్న బాధలు, కష్టాలు, సమస్యలను సత్వరం పరిష్కరించడానికి కమిషన్ నేరుగా బాధితుల వద్దకే వస్తుందన్నారు. గృహహింస కేసులు, సైబర్ నేరాలు, ఆన్ లైన్ వేధింపులు, చైల్డ్ కస్టడీ కేసులు, లైంగిక వేధింపులు, లైంగికదాడులతో పాటు ఇతర కేసులు కూడా కమిషన్ దృష్టికి వచ్చాయని చెప్పారు. హైదరాబాద్ పరిధి లో 2022 నుంచి 2024 దాకా ఉన్న కేసుల్లో సత్వరమే 30 కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద నేరెళ్ల, మహిళా సంక్షేమ శాఖ సంచాలకులు క్రాంతి వెస్లీ, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్స్ విశ్వ ప్రసాద్, అదనపు కలెక్టర్ ముకుందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రి చెరువు కబ్జా

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పిరంచెరువు ఆక్రమణకు గురువుతున్నది. కొందరు రాత్రి రాత్రి మట్టి కుప్పలు పోసి చదును చేస్తున్నారు. 34 ఎకరాలు..26 గంటలు ఉన్న ఈ చెరువు స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని రక్షించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

- బండ్లగూడ, ఏప్రిల్ 28

నేడు బాధ్యతలు స్వీకరించనున్న బల్దియా కమిషనర్

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా మంగళవారం ఆర్వీ కర్ణన్ బాధ్యతలు చేపట్టనున్నారు. రెండు రోజుల కిందట జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆర్వీ కర్ణన్‌ను జీహెచ్ఎంసీకి బదిలీ చేయగా...ఇక్కడ ఉన్న ఇలంబర్తిని పట్టణాభివృద్ధి కార్యదర్శి (హెచ్ఎండీఏ పరిధి)గా నియమించారు. ఇలంబర్తి నుంచి ఆర్వీ కర్ణన్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అడ్మిన్ విభాగం ఏర్పాట్లు చేసింది. దీంతో పాటు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని హెచ్ఎండీఏ సెక్రటరీగా నియమించారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా హేమంత్ సహదేవ్‌రావును నియమించారు.

లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కి

సిటీబ్యూరో: శామీర్‌పేట ఎస్ఐ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం... పరశురామ్ శామీర్‌పేట ఠాణాలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఇద్దరు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదైంది. తమను కేసులో నుంచి తప్పించడంతో పాటు సీజ్ చేసిన సెల్‌ఫోన్లను తిరిగి ఇచ్చేందుకు నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నుంచి ఎస్ఐ రూ.2 లక్షలు తీసుకున్నారు. సెల్‌ఫోన్ల కోసం మరో రూ. 22 వేలు డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు సోమవారం లంచం తీసుకున్న ఎస్ఐని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. అనంతరం నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

ఖజానా నింపుకొనేందుకు..

- తెరపైకి ఎల్ఈడీ డిజిటల్ బోర్డులు
- 749 కోట్లతో ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్ వద్ద హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు
- రహదారుల విస్తరణకు 269 చోట్ల ఆస్తుల స్వాధీనం
- వచ్చే నెల 1న స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదనలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనున్నది. పదకొండు ఎజెండాలను స్టాండింగ్ కమిటీ ముందు ప్రతిపాదన సిద్ధం చేశారు. ప్రధానంగా 11 చెరువుల పరిరక్షణ, అధ్యయనం, నిర్వహణ బాధ్యతలను నీరీ సంస్థకు అప్పజెప్పాలని ప్రతిపాదించారు. బండ్లగూడ క్రాస్ సమీపంలో రూ.212 లక్షలతో 1600 ఎంఎం డయా ఎంఎస్ పైపులైన్ పనులను ఆమోదించనున్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 34లో 4,350 స్క్వేర్ యార్డ్స్‌లో యానిమల్ హాస్పిటల్ ఫ్యాకల్టీ ఏర్పాటు, 25 ఏండ్ల నిర్వహణ బాధ్యతలు రాంకీ ఫౌండేషన్‌కు అప్పగించనున్నారు. డబీర్‌పురా పోలీస్ స్టేషన్ నుంచి నాగబౌలి జంక్షన్ వరకు రూ. 510 లక్షలతో రహదారి విస్తరణ, అపోలో హాస్పిటల్ ఎంటర్‌ప్రైజెస్ మూడేండ్ల పాటు సీఎస్ఆర్ పద్ధతిలో జూబ్లీహిల్స్ రోడ్ నం 36 బ్యాంబు పార్కును అభివృద్ధి చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకోనున్నారు. మరి కొన్ని చోట్ల రహదారి విస్తరణలో భాగంగా 269 ఆస్తుల స్వాధీనం చేసుకునేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదించనున్నది. వీటిన్నింటికంటే ముఖ్యంగా వ్యాపారస్తుల నుంచి ముక్కుపిండి వసూలు చేసి ఖజానాను నింపుకునే మరో కీలక ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రకటనల విభాగం తీసుకువస్తున్నది. వ్యాపారస్తులు తమ షాపుల ముందు ఏర్పాటు చేసిన ఎల్ ఈడీ డిజిటల్ బోర్డుల నుంచి ప్రతి ఏటా ఫీజులు వసూలు చేయనున్నది. మూడు కేటగిరీల్లో భాగంగా ఎస్ కేటగిరిలో రూ. 5500, ఏ కేటగిరిలో రూ.5500, బి కేటగిరిలో రూ. 5250, సీ కేటగిరిలో రూ.5వేల ఛార్జీలు వసూలు చేయనున్నది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీగా వసూళ్లను రాబట్టనున్నది. ఖాజాగూడ జంక్షన్, ఐఐటీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీని నివారణకు శాశ్వత చర్యల్లో భాగంగా మల్టీలెవల్ ఫ్లై ఓవర్, రహదారి విస్తరణకు.. 749 కోట్లతో హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు టెండర్ల అనుమతికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తీసుకోనున్నారు.

సోమవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పద్మవిభూషణ్ అవార్డును అందుకుంటున్న ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

వీధి లైట్ల నిర్వహణకు కొత్త పాలసీ

- ఈఈఎస్ఎల్ గడువు రెండు నెలల పాటు పొడిగింపు
- త్వరలో స్టాండింగ్ కమిటీ ముందుకు నూతన ప్రతిపాదనలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో వీధి దీపాల నిర్వహణ విషయంలో అధికారులు ఆలసత్వాన్ని వీడారు. నూతన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతుండడం, సదరు ఏజెన్సీ ఈఈఎస్ఎల్‌పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి... గడువు ముగిసినా.. ముందస్తు ప్రణాళిక కొరవడిన ఫలితంగా వీధి దీపాల సమస్యలపై అత్యధిక సంఖ్యలో ఫిర్యాదులు పెరిగాయి. అంతేకాకుండా ఈ నెల 24న వీధి లైట్ల సమస్యలపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ)సుమోటాగా తీసుకుని పురపాలక శాఖను వచ్చే జూన్ 4వ తేదీలోగా నివేదిక కోరిన సంగతి తెలిసిందే . ఈ క్రమంలోనే ప్రస్తుత నిర్వహణలో ఉన్న ఈఈఎస్ఎల్ ఏజెన్సీ గడువును మరో రెండు నెలల పాటు పొడగించి, ఈ లోగా నూతన పాలసీని తీసుకురావాలని నిర్ణయించారు. రెండు నెలల నిర్వహణలో భాగంగా ఒక్కో లైట్‌కు రూ. 18–22ల వరకు సదరు ఏజెన్సీ ఇవ్వాలని, 5.40 లక్షల లైట్లకు గానూ రూ.18ల చొప్పున నెలకు రూ.98 లక్షలు అవుతుందని, దాదాపు రెండు కోట్ల రూపాయలు సదరు ఏజెన్సీ చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, భువనేశ్వర్, సూరత్ నగరాల్లో వీధి లైట్ల నిర్వహణకు ఇండ్యూడవల్ లైట్ మానిటరింగ్ (ఐఎల్ఎం) విధానాన్ని అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయడంతో పాటు నివేదిక తయారు చేయాలని నిర్ణయించారు. పాత విధానంలో విద్యుత్ దుర్వినియోగంతో పాటు బిల్లుల చెల్లింపులోనూ అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. వీటన్నింటికీ చెక్ పెట్టాలని భావించి తెరపైకి కొత్త పాలసీ వైపు అడుగులు వేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో వీధి దీపాల లెక్కలపై సర్వే జరుపుతున్నారు. స్తంభాలు, లైట్లు ఎన్ని ఉన్నాయి? అనే లెక్క తేల్చడానికి స్ట్రీట్ లెవల్ నిర్వహణ సిస్టమ్ యాప్ ద్వారా సర్వే చేపడుతున్నారు. విద్యుత్ మీటర్లు, సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ప్యానల్స్, లైట్లు, పోల్స్ వంటి అన్ని ఆస్తుల వివరాలను నమోదు చేసి వాటి పనితీరును ట్రాక్ చేస్తున్నారు. ఎక్కడైనా వీధి దీపాలు పని చేయకపోతే ఆ సమస్యను తక్షణమే గుర్తించి వెంటనే పరిష్కరించేలా వ్యవస్థను తయారు చేస్తున్నారు. కొత్త విధానంలో ఎంత విద్యుత్ వినియోగిస్తే అంతే బిల్లు చెల్లించేలా మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. నూతన పాలసీకి సంబంధించి నివేదికను రూపొందించి త్వరలో జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన తర్వాత టెండర్లు పిలిచి కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు.